

పటిష్ట చర్యలు చేపట్టాలి

వైద్యులతో పాటు సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు రావాలి. ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు వద్ద ఔట్ పోలీస్ సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో డ్రస్ చేంజ్ రూమ్‌లు పక్కాగా ఏర్పాటు చేయాలి. వైద్యులతో పాటు వారి సేవలను గుర్తిస్తూ, వైద్యులకు, సిబ్బందికి ప్రజలు ద్వారా రక్షణ కల్పించే విధంగా అవగాహనా కార్యక్రమాలు గ్రామాల్లోనూ, కళాశాల్లోనూ ఏర్పాటు చేయాలి. దాడులకు పాల్పడుతున్న వారిపై సత్వర చర్యలు ఉంటే ఈ దాడులు ఆగుతాయి.

– డాక్టర్ కరణం హరిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, రాజాం



మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక నిఘా

ఆస్పత్రిలో పని చేసే మహిళా వైద్యులతో పాటు వైద్య సిబ్బంది రక్షణకు ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేయాలి. ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు ఆకతాయిలపై దృష్టి సారించాలి. వైద్య వృత్తిని నమ్ముకుని, రాత్రి పగలు కష్టపడి పని చేస్తున్న వైద్యులకు, సిబ్బందికి ఆస్పత్రితో పాటు ప్రయాణ సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా వైద్యులు, నర్సులకు ఆస్పత్రిల్లో మౌళిక వసతులు, ప్రత్యేకంగా రెస్టరూమ్, డ్రస్ చేజింగ్ రూమ్‌లు వంటివి ఏర్పాటు చేయాలి.

– టి.వరలక్ష్మి, సీనియర్ స్టాఫ్‌నర్సు, రాజాం ఏరియా ఆస్పత్రి



క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె.జనార్థన శుక్రవారం తెలిపారు. హిస్టరీ, ఎకనామిక్స్ సబ్జెక్ట్‌లలో పీజీ విద్యార్హత ఉండి, 50 శాతం మార్కులు కల్గి ఉండాలని వివరించారు. ఈ నెల 26లోగా బయోడేటాతో పాటు విద్యార్హత పత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో వార్షిక తనిఖీ



చిన్నయ్యపేటలో భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీ చిన్నయ్యపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 ఎంవీ ప్రసాదరావు, ఎంఈఓ – 2 బి.ఎరకయ్య శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుపట్టీలు పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఈ పరిశీలనలు జరిగాయిని ఎంఈఓలు తెలిపారు.

రోగులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంతకవిటి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 43 మందికి కంటి పరీక్షలు చేశారు. 11 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు ఆప్తాల్మిక్ వసంతరావు తెలిపారు. శిబిరంలో పీహెచ్‌సీలో వైద్యాధికారులు నాగేంద్రప్రసాద్, సౌమ్య తమ వంతు సేవలు అందించారు.

ఆశ్రమాల నిర్వహణ సక్రమంగా ఉండాలి



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: ఆశ్రమాల నిర్వహణ సక్రమంగా ఉండాలని కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. పట్టణ పరిధి కొండంపేటలో నిర్వహిస్తున్న అనాథ వృద్ధాశ్రమంతో పాటు సారధి రోడ్డులోని దివ్యాంగ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడి పారిశుద్ధ్యం, భోజన శాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పశువైద్య కేంద్రం తనిఖీ



పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీడీ డాక్టర్ నీలయ్య

తెర్లాం: స్థానిక పశువైద్య కేంద్రాన్ని పశు సంవర్ధక శాఖ బొబ్బిలి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రెడ్డి నీలయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. పశువైద్య కేంద్రంలో నిల్వ ఉన్న వ్యాక్సిన్, మందులను తనిఖీ చేశారు. ప్రతీరోజూ పశువైద్య కేంద్రానికి ఎన్ని పశువులు చికిత్స నిమిత్తం రైతులు తీసుకు వస్తున్నారని ఆయన సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశువైద్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేశారా, లేదా అని ప్రశ్నించారు. ఆస్పత్రికి రైతులు తీసుకు వచ్చే పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు.

నేడు సోషల్ ఆడిట్

బొబ్బిలి రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీలకు విడుదలైన ప్రభుత్వ నిధులు, వినియోగంపై సోషల్ ఆడిట్ కో ఆర్డినేషన్ సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

గ్రామ సభల ద్వారా గ్రామాభివృద్ధి

గ్రామ సభల ద్వారా ప్రజల సమక్షంలోనే గ్రామాభివృద్ధికి కావాల్సిన పనుల ఎంపిక చేయడంతో గ్రామాలు అభివృద్ధి బాట పడతాయని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల వ్యాప్తంగా శుక్రవారం గ్రామసభలు జరిగాయి. గ్రామానికి అవసరమైన ప్రధానమైన పనులకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సభలో జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, ఎమ్మెల్యే బేబీనాయన, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: ఎం.ఆర్ అగ్రహారం గ్రామసభలో గుర్తించిన పనుల వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు



బొబ్బిలి రూరల్: పారాది గ్రామసభలో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్



రామభద్రపురం: కోటశిర్లాం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన



రాజాం : బొద్దాంలో గ్రామ సభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సక్క వర్షిణి



వావిలవలస గ్రామసభలో గుర్తించిన పనులు వివరిస్తున్న ఏపీఓ హరనాధరావు



వంగర: మరువాడలో జరుగుతున్న గ్రామసభ

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

• ఎన్‌సీడీ పీఓ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం



డాక్టర్ వంశీకి సూచనలిస్తున్నపీఓ సుబ్రహ్మణ్యం

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ పీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని పిరిడి పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది రోగులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల సమాచారం తీసుకుని ప్రతిరోజు సమీక్ష జరపాలన్నారు. గ్రామీణులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని అందుకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎంసీహెచ్, ఆర్‌సీహెచ్ టీకాలను లక్ష్యాల మేరకు శతశాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ వంశీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

14న లోక్‌అదాలత్

• సీనియర్ సివిల్‌జడ్జి అరుణశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అరుణశ్రీ

బొబ్బిలి: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సెప్టెంబరు 14న నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో పార్వతీపురం రెండో అదనపు జడ్జి ఎస్.దామోదరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులతో శుక్రవారం జరిగిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులలో కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీ చేయాలని తెలిపారు. కోర్టు పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి, కక్షిదారులకు సత్వర న్యాయం అందేందుకు ఈ లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే డబ్బు, సమయం రెండూ ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి రోహిణీరావ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.మోహనకుమార్, ఏపీపీ, ఏజీపీ, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

• ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి



బొబ్బిలి: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు విమర్శించారు. తన కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం దాడులకు దిగుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీకి ఓటు వేసిన వారందరిపై కక్ష సాధింపులకు దిగుతోందని, ఇటువంటి పరిస్థితులు ఇంతకు ముందెన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, అనంతపురం జేసీ అనుచరులు ప్రతిపక్ష నాయకులపై చేస్తున్న దాడులు చూస్తుంటే కూటమి నాయకుల తప్పా ఇంకెవరూ ఉండకూడదన్న ఉద్దేశం బయటపడుతుందన్నారు. అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ఇది రాష్ట్రానికి మంచిది కాదని కూటమి ప్రభుత్వం తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు.

డ్రగ్స్ వాడి జీవితాలను పాడుచేసుకోవద్దు : డీఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వాడకంతో యువకులు తమ విలువైన యవ్వనంతో పాటు జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని వాటికి దూరంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు హితవు పలికారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి మండపంలో శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మాయిలపై అత్యాచారాలు, డ్రగ్స్‌ని యంత్రణ అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తులో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడి కటకటాలపాలౌతున్నారన్నారు. దీంతో వారి అందమైన యవ్వనాన్ని కోల్పోయి కోర్టులు, కటకటాల మధ్య గడుపుతున్నారన్నారు. ఇటీవల మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలు మత్తులో చేసినవేనని, మత్తుతో మనిషి విచక్షణ కోల్పోతాడన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి, సీఐ సతీష్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



నందబలగ సచివాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంతో పాటు పలు గ్రామాల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నందబలగ గ్రామ సచివాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, కూనాయవలస యూపీ స్కూల్‌లో ఎంఈఓ త్రినాధరావు, తెర్లాం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, హైస్కూల్‌లో హెచ్ఎం రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా, జాతీయోద్యమంలో బ్రిటీష్ వారిని ఎదురించి పోరాడిన మహోన్నత వ్యక్తి టంగుటూరి అన్నారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని కోరారు.

క్యాన్సర్‌పై వైద్య శిబిరం రేపు

బొబ్బిలి: క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్న రోగుల కోసం మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, వాసన్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మహిళలకు ఉచిత గైనిక్ స్క్రీనింగ్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ మరియు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్టు పేర్కొన్నారు. 3వ వార్డు సంఘ వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఎదురుగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఫార్మా కంపెనీ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

బొబ్బిలి: అచ్చుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ఘటనలో పదుల సంఖ్యలో జరిగిన మరణాలను యాజమాన్యం చేసిన హత్యాకాండగా కేసు నమోదు చేసి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రైతుకూలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఝాన్సీ, డి.వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అచ్చుతాపురం సెజ్‌లో ఉన్న ఎస్సెన్షియ అడ్వాన్స్ సైన్సెస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడగా మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డ ఘటనను ప్రభుత్వం సీరియస్ తీసుకోవాలని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా వారి ప్రాణాలతో యాజమాన్యం చెలగాటమాడుతుందని ఆరోపించారు. కమిటీలు, నష్టపరిహారాలతో ప్రభుత్వం చేతులు దులుపుకోకుండా ఫార్మా కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రా.ర.వే సమావేశం రేపు

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం ఆదివారం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొట్నూరు కోటిబాబు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో 'కొండపాలంలో వ్యక్తిత్వ విలువలు' అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు ప్రసంగించనున్నారని అన్నారు. కార్యక్రమానికి సాహితీవేత్తలు, కవులు, రచయితలు, భాషాభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

సీహెచ్‌సీని సందర్శించిన మంత్రి

బొబ్బిలి: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బొబ్బిలి సీహెచ్‌సీని శుక్రవారం సందర్శించారు. జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ వెళ్తూ సీహెచ్‌సీని పరిశీలించారు. ఆస్పత్రి నిర్వహణ, కొత్తగా చేపట్టబోయే పనులు, కావాల్సిన నిధులపై ఎమ్మెల్యే బేబీనాయనను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రతిరోజు వస్తున్న రోగుల సంఖ్య, చికిత్సా విధానం అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావుకు సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



అప్పయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: మండలంలోని బొమ్మినాయుడువలస పంచాయతీ గొల్లపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత యలమంచిలి రామకృష్ణను వైఎస్సార్ సీపీ నియోజకవర్గఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ఈయన తండ్రి అప్పయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజేష్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు అప్పయ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్, గెడ్డాపు అప్పలనాయుడు, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



అచ్చులను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

రాజాం సిటీ: ప్రతీ ఒక్కరు మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఎంఈఓలు పి.ప్రవీణ్, వై.దుర్గారావు కోరారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో వినాయక ప్రతిమల అచ్చులు శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో వీటిని ఉపయోగించి అవగాహన కల్పించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ఉపాధ్యాయులు వీటిని తీసుకువెళ్లి విద్యార్థులచే మట్టి వినాయకుడిని తయారు చేయించే విధంగా చూడాలని సూచించారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు వికాస తరంగిణి కార్యాలయంలో అందుబాటులో ఉన్న అచ్చులను తీసుకువెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో టీటీవీ రమణమూర్తి, బెవర బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారపురం గ్రామసభ రసాభాస



టీడీపీ కార్యకర్తలను బయటకు పంపిస్తున్న పోలీసులు

సంతకవిటి: మండలంలోని చిత్తారపురంలో శుక్రవారం జరిగిన గ్రామసభ రసాభాసగా సాగింది. తమ పార్టీ అధికారంలో ఉండగా తమ పార్టీ వాళ్లకు కుర్చీలు వేయకుండా ప్రతిపక్ష పార్టీ వాళ్లకు గౌరవించడమేమిటంటూ టీడీపీ కార్యకర్తలు రాద్ధాంతం చేశారు. అధికారులపై తిరగబడ్డారు. వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగించారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజగోపాల్

రాజాం సిటీ: ప్రజల్లో మూఢవిశ్వాసాలను పోగొట్టి శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నియోజకవర్గ స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

మూఢ విశ్వాసాల వ్యతిరేక చట్టాన్ని జాతీయ స్థాయిలో తీసుకురావాలని అన్నారు. మహిళా రక్షణకు సరైన చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణ ప్రభాత్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, సమతా నాయకురాలు జి.నిర్మల, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన జేవీవీ సభ్యులు జి.పాపారావు, మక్క అప్పలనాయుడు, గిరడ చంద్రశేఖర్, పెంకి చైతన్యకుమార్, పండూరి వేణుగోపాల్, ఎ.వెంకటినాయుడు, రెడ్డి మోహనరావు, బెవర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ పూజలు



రేగిడి: దేవుదళ గీతాశ్రమంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు



వంగర: ఎం.సీతారాంపురంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రేగిడి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ లక్ష్మీ పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో వరలక్ష్మీ పూజలు

రాజాం: శ్రావణమాస శుక్రవారం రాజాం పట్టణంతో పాటు మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గాయత్రీ కాలనీలోని శ్రీవేద గాయాత్రీమాత ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి.

శ్రీదుర్గాలయాల్లో పూజలు

వంగర: మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా మండల పరిధి రుషింగి, ఎం.సీతారాంపురం గ్రామాల్లో వెలసిన శ్రీదుర్గాదేవి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఎం.సీతారాంపురం శ్రీదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

రాజాం సిటీ: పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణమాస పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పాలకొండ రోడ్డులోని విద్యాలక్ష్మీగణపతి ఆలయం, బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడవ శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని కుంకుమార్చనలు జరిపారు.